ప్రజాశక్తి

ఆదివారం 27 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఇళ్ల పట్టాల అమ్మకంపై ధ్వజం

◆ రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని జెడ్‌పి సమావేశంలో సభ్యుల సూచన

◆ గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వాలన్న మంత్రి అమర్‌నాథ్

◆ పాఠశాలల పరిశీలనకు అభ్యంతరం చెప్పే హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని ఆదేశం

మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్. పక్కన ధర్మశ్రీ, సుభద్ర తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి పట్టాల అమ్మకాలపై జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. అమ్మకం చేసిన పట్టాలను రద్దుచేసి, అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని సూచించారు. పట్టాల అమ్మకాలపై పలువురు సభ్యులు చేసిన ప్రస్తావనపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ స్పందించారు. పట్టాలు అమ్ముకొనేవారి పట్టాలు రద్దుచేసి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇళ్ల పట్టాల అమ్మకాలు, ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం, పనులు జరగకుండా బిల్లులు చెల్లింపు, పాఠశాలల పరిశీలనకు ఏజెన్సీలో ప్రధానోపాధ్యాయుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ప్రస్తావించారు. ఇళ్ల పట్టాల అమ్మకాలు జరుగుతున్న విషయాన్ని ఎమ్మెల్సీ మాధవ్, నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ సహా పలువురు ప్రస్తావించడంపై ధర్మశ్రీ కలుగజేసుకొని ఇళ్ల పట్టాలు అమ్మకాలు జరిగిన వాటిని రద్దు చేసి అర్హులకు అందజేయాలని అన్నారు. దీనిపై విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ స్పందిస్తూ ఇళ్ల పట్టాల అమ్మకాలపై విచారణ జరిపి చర్యలు

మిగతా 2లో..

గృహ, రహదారుల నిర్మాణాలకు అనుమతివ్వాలి

- సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సమస్యలను ప్రస్తావిస్తున్న గంగరాజు

పెదబిడ్డ పంచాయతీలో గ్రామకంఠం లేక పోడుభూముల్లో ఇళ్లు కట్టుకుంటున్న గిరిజనులను అటవీ శాఖాధికారులు వేధించకుండా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు అన్నారు. గృహ, రోడ్ల నిర్మాణాలకు అనుమతులివ్వకపోవడం వల్ల పనులు జరగడం లేదన్నారు. రహదారులు నిర్మించకుండానే రోడ్లు నిర్మించినట్లు చూపించి రూ.8 కోట్లు డ్రా చేసిన అధికారులపై చర్యలు తీసుకొని, వాటిని తిరిగి రాబట్టాలన్నారు. విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ పెంచి విద్యార్థులకు విద్య అందించేలా చూడాలన్నారు. వెంకయ్యపాలెం పాఠశాలను చిలకలగెడ్డ పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంకయ్యపాలెంలో పాఠశాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ అగ్రభాగాన ఉమామహేశ్వరరావు, జగ్గునాయుడు తదితరులు

పారిశుధ్య కార్మికుల పర్మినెంట్‌కు ఉద్యమం

◆ రూ.28 వేలు వేతనం అమలుకు పోరాటం

◆ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

◆ విశాఖలో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ రంగంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసే వరకు ఐక్యంగా ఉద్యమించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మున్సిపల్ కార్మికులకు పిలుపునిచ్చారు. పర్మినెంట్ అయ్యే వరకూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం రూ.28 వేలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా 10వ మహాసభలు శని, ఆదివారాల్లో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం సరస్వతీ పార్కు నుంచి ఆశీల్‌మెట్ట వరకు వేలాది మందితో కార్మిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కళారూపాలు ప్రజలను

మిగతా 2లో..

అదానీకి కారుచౌకగా భూములు : టిడిపి

▶ వార్త మెయిన్‌లో..

పంటల గిట్టుబాటు ధర చట్టం తేవాలి

▶ వార్త 5లో..

ఎపి పునర్విభజన చట్టాన్ని అమలు చేయాలి

▶ వార్త 8లో..



పరవాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు అనకాపల్లి జిల్లా నేతలు, ప్రజలు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

◆ వాడవాడలా ర్యాలీలు, ప్రతిజ్ఞలు

◆ ప్రభుత్వ రంగ సంస్థల్లో సందడిగా కార్యక్రమాలు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అంబేద్కర్‌కు ఘన నివాళి

వార్తలు లోపలి పేజీల్లో..

ఓటర్ల నమోదు సక్రమమేనా ?

◆ పోలింగ్ బూత్‌లవారీ జాబితా తనిఖీ చేశారా ?

◆ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై సర్వత్రా వెల్లువెత్తుతున్న సందేహాలు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విస్మయంగొలిపే ఘటనలు వెలుగులోకి..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నికల కోసం తాజాగా జరిగిన ఓట్ల నమోదు ప్రక్రియ అంతా సజావుగా సాగిందా.. ? అంటే పలుచోట్ల సక్రమంగా జరగలేదన్నది వాస్తవాలతో తేటతెల్లమవుతోంది. ఎన్నికలంటేనే కులం, ధనం, ప్రాంతం, అధికారం - ఈ ప్రాధాన్యతల ప్రాతిపదికపైనే ఉంటాయన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. పట్టభద్రుల ఓట్లు విషయంలోనూ ఈ ఆనవాళ్లు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. 'అధికార' పట్టు కనిపిస్తోంది. ఓట్ల నమోదుకే రూ.కోట్లు ఖర్చు చేశారన్న ఆరోపణలు రాష్ట్రంలోని పలుచోట్ల అధికార పార్టీ అభ్యర్థులపై ఇప్పటికే ఉన్నాయి. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకుని



397	RATNAMALA Patchi pulusu	LAKSHMANA KUMAR	14-23,Gavarapalem,ANAKAPALLI 14-23,,	DEGREE		01-05-1956	F		Photo of the Elector is Available
398	RATNAMALA Patchi pulusu	LAKSHMANA KUMAR	14-23,Gavarapalem,ANAKAPALLI 14-23,,	DEGREE		01-05-1956	F		Photo of the Elector is Available
399	RATNAMALA Patchi pulusu	LAKSHMANA KUMAR	14-23,Gavarapalem,ANAKAPALLI 14-23,,	DEGREE		01-05-1956	F		Photo of the Elector is Available

అనకాపల్లి జిల్లా ఓటర్ల జాబితాలో ఒకే ఓటరు పేరు మూడు సార్లు వరుసగా ఉన్న దృశ్యం

ఈ తంతును నడిపిస్తారనడంలో ఎలాంటి శషబిసలూ లేవు. ఓట్ల నమోదుకు సంబంధించి నవంబర్ 7న ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఒకేసారి 80 వేలకు పైచిలుకు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో కొన్ని బూత్‌ల్లో ఈ ఓటర్ల నమోదు ప్రక్రియను చూస్తే విస్మయం కలుగుతోంది.

ఒకరి పేరే...డబుల్...త్రిబుల్ ఎన్‌రోల్‌మెంట్

అనకాపల్లికి చెందిన 195 బూత్‌లో ఓటరు జాబితాను

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇళ్ల పట్టాల అమ్మకంపై ధ్వజం

తీసుకుంటామన్నారు. అనర్హులకు మంజూరుచేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి రాంబాబు కోరారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలో రవాణా ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ఇళ్ల విలువను రూ.1.80 లక్షల నుంచి నాలుగు లక్షలకు ప్రభుత్వం పెంచాలన్నారు.

ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని రాంబిల్లి జెడ్‌పిటిసి నాగరాజు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరగా మంత్రి అమర్‌నాథ్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయి అధికారిని నియమిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లు తెలిపారు. గొర్రెలు, మేకలు పెంపకందార్ల సహకార సంఘం జిల్లా ఛైర్మన్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకల కోసం షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

మంత్రి అమర్‌నాథ్ ఆగ్రహం

అనుమతి తీసుకోకుండా జిల్లా పరిషత్ సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశించారు. గృహ నిర్మాణాలపై చర్చ జరుగుతున్నప్పుడు అనకాపల్లి హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సమాధానం చెప్పాలని మంత్రి పిలిచారు. ఆయన సమావేశానికి రాలేదని చెప్పడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా సమావేశానికి రాని అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. పాఠశాలల పరిశీలనకు లోపలకు అనుమతించడంలేదని ఏజెన్సీకి చెందిన పలువురు జెడ్‌పిటిసి సభ్యులు ప్రస్తావించడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. పాఠశాలల పరిశీలనకు అభ్యంతరం చెబుతున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు.

బడ్జెట్ ఇలా..

ప్రతిపాదిత జిల్లా పరిషత్ 2022-23 సవరణ బడ్జెట్ ప్రకారం ఆదాయం రూ.1155 కోట్లు, వ్యయం రూ.1143 కోట్లు, 2023-24 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.982 కోట్లు, వ్యయం రూ.980 కోట్లను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర సమావేశంలో ప్రవేశపెట్టారు. సభ్యులు ఆమోదించారు.

ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా పరిషత్ సిఇఒ పి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు సక్రమమేనా ?

పరిశీలిస్తే.. ఈ బూత్‌లో 1489 ఓట్లలో రెండు సార్లు తమ ఓటును నమోదు చేయించుకున్న వారు 35 మంది దర్శనమిచ్చారు. మూడు సార్లు నమోదైన వారు ఇద్దరుండగా, నాలుగుసార్లు ఒక వ్యక్తి నమోదు అయ్యాడు. విశాఖ జిల్లాకు సంబంధించి 210 బూత్ నెంబరునుగనక చూస్తే 20 మంది పట్టభద్రులు రెండు సార్లు ఓటు నమోదు చేసుకోగా, ఒక వ్యక్తి పేరు మూడు దఫాలు ఓటరుగా, నాలుగు సార్లు ఒక వ్యక్తి వివరాలు ఓటరుగా నమోదయ్యాయి. ఇవి కేవలం రెండు బూత్‌లలో చోటుచేసుకున్న వ్యవహారాలు మాత్రమే. అన్నిచోట్లా బూత్‌లలో ఈ తనిఖీ జరిగితే పరిస్థితి ఎలా ఉంటుంది ? అధికారులు ఎందుకు పరిశీలన చేయలేదు.. తెలిసి మౌనం దాల్చుతున్నారా ? ఒత్తిడులేమైనా ఉన్నాయా ? అన్న విషయాలు తేలాల్సి ఉంది. ఆధార్ నెంబరు చాలా వరకూ ఓటర్లు నమోదు సందర్భంగా వెల్లడించడం తెలిసిందే. దీని ప్రకారమైనా చెక్ చేసి ఉంటే డబుల్, త్రిబుల్ ఎన్‌రోల్‌మెంట్ బయటపడేది. అలాగే ఓటర్లకు ఓటు వేసే ప్రదేశాలను ఎంపిక చేసిన తీరూ అనుమానాస్పదంగానే ఉంది. పిన్‌కోడ్‌ల ప్రకారం ఏ ప్రాంతంలో వారికి అక్కడే బూత్‌లలో ఓటు వేసే అవకాశం కల్పించాలి. కానీ పిన్‌కోడ్ ఒకచోట ఓటు కేటాయించింది మరోచోట.. ఈ తరహా వ్యవహారాలూ ఓటర్ల నమోదులో చోటుచేసుకున్నాయి. ఓటింగ్ రోజున ఓటర్లు గగ్గోలు పెట్టకముందే సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని గుర్తించి సరిచేయాలన్న డిమాండ్ పలువురి నుంచి వినిపిస్తోంది.

ఎన్నికల అధికారులు ఏమంటున్నారు ?

ఒకే వ్యక్తి పేర డబుల్, త్రిబుల్ ఓటు ఎంట్రీలపై కలెక్టరేట్‌లోని ఓ అధికారి 'ప్రజాశక్తి'కి వివరణ ఇస్తూ... అవన్నీ సరిచేసి జాబితాలు సిద్ధం చేశామని, ఒకవేళ ఫిర్యాదుల్లాంటివి వస్తే సరిచేస్తామని తెలిపారు. వార్డుల్లో నమోదు ప్రక్రియ జరిగినప్పుడు ఈ తరహా ఎంట్రీలు వ్యక్తులు, సంస్థలు, తమకు తెలిసిన నాయకులు, అధికారులకు ఒకే వ్యక్తి పలు దఫాలుగా ఇచ్చి ఉండొచ్చు ? అని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోపక్క ఓట్ల విషయాలు కచ్చితమా ? కాదా ? అన్నది తేలాలంటే శాస్త్రీయ పద్ధతిలో పరిశీలనా ప్రక్రియ జరగాల్సిందేనని పలువురు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

పారిశుధ్య కార్మికుల పర్మినెంట్‌కు ఉద్యమం

ఆకట్టుకున్నాయి. ఆశీల్ మెట్ట వద్ద జరిగిన బహిరంగ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పాలిస్తున్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్లుగా మార్చి యజమానుల పక్షాన నిలిచాయన్నారు. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అనేక ఇబ్బందులను ఓర్చి ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. ధరలు భారీగా పెరుగుతున్నా, కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని, ఉన్న జీతాలు తగ్గించే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, పిట్టర్లు, హెల్పర్లు, వాల్ ఆపరేటర్లను టెక్నికల్ కార్మికులుగా గుర్తించి టెక్నికల్ జీతాలు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.10 వేలు కాకుండా రూ.18,500 జీతాలు చెల్లించాలన్నారు .ఆయాలకు జీవో 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సిఐటియు సాధించిన విజయాలను గుర్తు చేశారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్సును రాష్ట్ర ప్రభుత్వం ఆపేస్తే పోరాడి తిరిగి సాధించుకున్న ఘనత సిఐటియుదేనన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తేనే అమలవుతున్నాయన్నారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని, ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటించడానికి కార్మిక వర్గం మరింత చైతన్యవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభకు యూనియన్ అధ్యక్షులు జి.సుబ్బారావు అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి పి.మణి, మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, నాయకులు యు.రాజు, టి.నూకరాజు, రత్నం, జెఆర్.నాయుడు, ఎస్.ఇందీవర, ఆర్.లక్ష్మణమూర్తి, గొలగాని అప్పారావు, ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజు, లక్ష్మణమూర్తి, జి.అప్పారావు, ఇ.ఆదినారాయణ, ఎం.సూరీడు పాల్గొన్నారు.

రాజకీయ కదలికలు.. ఊహాగానాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఏ సమాజాన్నైనా సజీవంగా నిలుపుతున్నవి రాజకీయాలే' అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. 'ప్రజలు వారిని పొగుడుతున్నారా ? తిడుతున్నారా ? అన్నది ముఖ్యం కాదు.. తన గురించి చర్చిస్తున్నారా ? లేదా ? అన్నదే రాజకీయాల్లో ముఖ్యం' - అని ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తి విన్‌స్టన్ చర్చిల్ అన్న మాటలు రాజకీయాల గురించి వివరించిన విషయాల్లో ఉండడం తెలిసిందే. నేడు చుట్టూ జరుగుతున్న రాజకీయాల గురించి మాట్లాడాల్సి వస్తే ప్రధాన రాజకీయ పార్టీల్లో నాయకుల కదలికలు, వారు పార్టీల మారుతున్న వైనాలు, ఊహాగానాల గురించి ప్రాధాన్యతగా ఎవ్వరైనా చర్చించడం సాధారణమైన విషయం. విశాఖపట్నం అభివృద్ధిని మట్టుపెట్టాలని చూసే రాజకీయం కూడా ఒకవైపు సంవత్సరాల తరబడి సాగుతున్న సంగతి తెలిసిందే. ఒకటా....రెండా... ఈ అంశంపై ఎన్నయినా వివరాలు, వాస్తవాలు కళ్లముందే కదలాడుతున్నాయి. దీంట్లో ప్రసిద్ధమైనది రాష్ట్రంలోనేగాక దేశ కార్మికవర్గంలో వేడిని రగిలిస్తున్న 'విశాఖ స్టీల్‌ప్లాంట్' పరిరక్షణ పోరాటం. ఇది 650 రోజులుగా సాగుతోంది. కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా కార్మిక పోరాటాన్ని లెక్కచేయకుండా కేంద్ర బృందాలను, అదానీ మనుషులను పంపి ప్లాంట్ ఆస్తులను లెక్కకట్టి దోచుకోడానికి 'ముఠా'ను పంపిన విషయం తాజాగా బయటపడింది. ఈ ప్రాంతంలో ఈ ముఠాపైనే అన్ని తరగతుల ప్రజానీకంలోనూ చర్చ జరుగుతోంది. కానీ పాలకులు పార్టీల ఫిరాయింపులు, దేవుళ్లు, గుడులు, గోపురాల గురించిన విషయాలనే ప్రజలపై రుద్ది తమ రాజకీయ కార్యాచరణకు మార్గం సుగమం చేసుకోవడం తెలిసిందే. ఒక్కమాటలో చెప్పాలంటే.. 'ప్రజలను వారికి సంబంధించిన వాస్తవమైన సమస్యలు, విషయాల నుంచి పక్కదారిపట్టించే 'కళే' రాజకీయం అని ఒక రాజకీయ వేత్త చెప్పడాన్ని బిజెపి నేతలకు అన్వయించవచ్చు. ఇక్కడేమీ జరగనట్లు...సమస్యే విశాఖలో ఏమీ లేనట్లు వైజాగ్ వచ్చి సభ నిర్వహించి మరీ మోడీ వెడలిపోయిన వైనం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

రాజకీయాల్లో మార్పులు, చేరికలు

ప్రధాన రాజకీయ పార్టీల్లో ముఖ్యంగా అధికార వైసిపిలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఊపందుకుంది. ఇప్పటికే మాజీ మంత్రి, భీమిలి ఎంఎల్‌ఎ ముత్తంశెట్టి శ్రీనివాసరావును విశాఖ జిల్లా పార్టీ పగ్గాల నుంచి తప్పించి పంచకర్ల రమేష్‌కు అధ్యక్షత బాధ్యతలు అప్పగించారు. అనకాపల్లి జిల్లాకు ధర్మశ్రీని అధ్యక్షుడిగా వైసిపి అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. భీమిలిలో ముత్తంశెట్టి కార్యకలాపాలతో తన జోరు పెంచారు. 2024 ఎన్నికలే ధ్యేయంగా ఆయన అనుయాయులు అక్కడ గడప గడపకూ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. మరోవైపు జిల్లాలో అభ్యర్థులు బలాబలాలపైనా వైసిపి అంతర్గత కమిటీల పర్యటనలు ముమ్మరం అయ్యాయి..

సందట్లో సడేమియా అన్నట్టుగా...

మాజీ మంత్రి, టిడిపి నాయకుడు గంటా శ్రీనివాసరావు వైసిపిలో చేరతారన్న ప్రచారం విశాఖలో ప్రారంభమైంది. 2019లో విశాఖలోని ఉత్తర నియోజకవర్గంలో గెలిచి ఎవ్వరికీ కనబడకుండా నగరం నుంచి వెళ్లిపోయిన గంటా మళ్లీ రాజకీయ తెరపై తళుక్కుమనడం తాజా పరిణామం. పైగా స్టీల్‌ప్లాంట్ ఉద్యమం కోసం తాను ఎంఎల్‌ఏగా రాజీనామా చేసి పోరాడతానని చెప్పి మరీ ఆయన పత్తాలేకుండా పోయారు. తాజాగా లీకులు వదులుతున్నారు. ప్రత్యేక సందర్భంలోనో.. ఎన్నికలప్పుడో లీకులు వదలడం గంటాకు షరామామూలే. డిసెంబరు 1న తన పుట్టిన రోజున వైసిపి తీర్థం పుచ్చుకుంటారానే ఊహ 'గానం' తాజాగా వదిలారు. దీంతో ఆ పార్టీలో ప్రతిస్పందన ఎలావుంది ? ప్రజల్లోనూ, ఇతర పార్టీల్లోనూ తన గురించి ఏం చర్చ సాగనుందన్న వ్యూహం కూడా గంటాకు, ఈ ప్రచారాన్ని పెట్టిన వ్యక్తులకు ఉంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ విషయంపై విశాఖలో తాజాగా పార్టీ అధినేత వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా పార్టీ పటిష్టానికి వస్తే చేర్చుకుంటామని, అయితే అంతిమ నిర్ణయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనంటూ నొక్కిఒక్కానించడం తెలిసిందే. ఆయన్ను చేర్చుకుంటే భవిష్యత్తులో మరో త్రిబుల్ ఆర్ (రఘురామకృష్ణంరాజు) అవుతాడంటూ వైసిపి కేడర్‌లోనూ చర్చ సాగుతోంది. ఆయనెలా పార్టీలో ఎంపీ సీటు గెలిచి ప్రతిపక్షాలతో కలసిపోయి ప్రభుత్వంపై విమనార్శనాస్త్రాలు సంధిస్తున్నాడో.. గంటా కూడా అదేచేస్తాడన్న చర్చ సాగుతోంది. జరుగుతున్న ఈ ఊహాగానాలు, కదలికలన్నీ వాస్తవ సమస్యల నుంచి పక్కదారిపట్టించేవే. విశాఖ అంటేనే కార్మికవాడగా అంతర్జాతీయంగా ఖ్యాతిచెందుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం కావడమే అందుకు కారణం.

రాందేవ్ బాబా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన యోగా గురువు రాందేవ్ బాబాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎ.విమల డిమాండ్ చేశారు. మహిళల వస్త్రధారణపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం సిగ్గు చేటన్నారు. ఆయన్ని దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి మహిళా సమాఖ్య, సిపిఐ, అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలతో కలిపి రాందేవ్ బాబా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకొని తీరుతామని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 604వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

డెంటల్ కాలేజీ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో ప్రభుత్వ డెంటల్ కాలేజీ ఏర్పాటు చేయడానికి కషి చేస్తానని టిటిడి ఛైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఆ విషయమై త్వరలో సిఎం జగన్మోహన్ రెడ్డితో చర్చిస్తానన్నారు. ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం జరిగిన 41వ రాష్ట్ర డెంటల్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కడప, విజయవాడల్లో మాత్రమే ప్రభుత్వ డెంటల్ కాలేజీలు ఉన్నాయని, విశాఖలోనూ డెంటల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ కోరగా సిఎం దృష్టికి తీసుకెళ్తానని సుబ్బారెడ్డి తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అబ్దుల్ సత్తార్ - ఖైరున్నిస ఫౌండేషన్ (ఎఎస్‌కె) విశాఖపట్నం ఆధ్వర్యాన శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు నుంచి జగదాంబ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ అబ్దుల్ అహద్ ఆశ్రఫ్ మాట్లాడారు. భారత రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నది తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తమ సంస్థ ద్వారా ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అబ్దుల్ మునీర్ ముషీహాద్, వైస్ ఛైర్‌పర్సన్ దేవులపల్లి పోలమాంబ దేవి పాల్గొన్నారు.

ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. ఆ ప్రాంతానికి చెందిన నిర్వాసిత సంఘ ప్రతినిధులు శనివారం అమర్‌నాథ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఎన్ఎఓబి వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రికి తెలియజేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు గతంలో అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

2,43,903 మంది ఓటర్లుగా నమోదు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈ నెల 23 వరకూ నమోదైన ఓటర్ల తుది వివరాలను శనివారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. తాజా గణాంకాల ప్రకారం ఇప్పటి వరకూ ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలలో 2,43,903 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1080/2020

Between:
Canara Bank
(erstwhile Syndicate Bank)
Seethammadhara Branch,
Rep. by its Branch Manager
...Plaintiff-Bank

And:
Kadiri Gurunadham & Another
...Defendants

SUMMONS

To,
Defendant No.2 :
Sri Potti Krishna,
S/o.not known, Hindu,
aged about 50 years,
R/at. D.No.5-2-289,
Pedajalaripeta, Pedawaltair,
Visakhapatnam-1 7.

Please take notice that the above named plaintiff-Bank has instituted the above suit against you for recovery of an amount of **Rs.2,38,752.09ps** and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **02-12-2022** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **02-12-2022** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

K. DAKSHINA MURTHY (K.D.M)
Advocate
Visakhapatnam,
Cell : 98481 46393

కఠోర శ్రమ ద్వారానే లక్ష్య సాధన

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే లక్ష్యాన్ని సాధించగలమని అవంతి విద్యా సంస్థల అధినేత, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముత్తంశెట్టి మాట్లాడుతూ, ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలన్నారు. మన చుట్టూరా ఉన్న అపారమైన వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ, ఎంచుకున్న సబ్జెక్ట్‌లో పట్టు సాధించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. మరో గౌరవ అతిథి జెఎన్‌టియు, విజయనగరం, గురజాడ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామినాయుడు మాట్లాడుతూ, రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, కళాశాల ఎఓ సంతోష్, డైరెక్టర్ చంద్రశేఖర్, పలువురు ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా జివిఎంసి కమిషనర్ రాజాబాబు జ్యోతి వెలిగించి ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రారంభించారు.

కాజ్‌వే నిర్మాణానికి కృషి : ఎంపిపి వాసురాజు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు గోస్తనీపై కాజ్ వే నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు చెప్పారు. గ్రామ సర్పంచ్ శిరిగుడి సంతోషి, మాజీ సర్పంచ్ దుంపల నాగమణి, వైసిపి నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, శిరిగుడి ఈశ్వరరావు, దుంపల ప్రభాకర్, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు తదితరులతో కలిసి సంబంధిత ప్రాంతాన్ని శనివారం ఎంపిపి పరిశీలించారు. కాజ్‌వే ఆవశ్యకతను ఎంపిపి దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.2 కోట్లతో కాజ్‌వే నిర్మాణ పనులు త్వరలో ప్రారంభ మవుతాయని స్పష్టం చేశారు.

రూ.20 వేలు సాయం

అనారోగ్యంతో ఉన్న తాటితూరు కళ్లాలకు చెందిన వి.పెదరమణను ఎంపిపి పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు.

తాటితూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిపి వాసు రాజు

నాడు - నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్‌లో గల వరల్డ్ విజన్ ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు పనులను కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ శనివారం పరిశీలించారు. నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాల అదనపు తరగతులు, రక్షణ గోడ, మరుగుదొడ్ల పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతీదేవి, వైసిపి నాయకులు బేత దుర్గారావు, పిల్లి వీర్రాజు, శ్రీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి అగనంపూడి ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత బొడ్డేడ వరలక్ష్మి (38) మృతి చెందింది. దువ్వాడ పోలీసుల కథనం ప్రకారం... మృతురాలు వరలక్ష్మి, భర్త రాముతో అక్కిరెడ్డిపాలెంలోని డెయిరీ ఫామ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం యలమంచిలిలోని కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నారు. అగనంపూడి వచ్చేసరికి రాజమండ్రి నుంచి వస్తున్న బస్సు ఢీకొనడంతో వరలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

పట్టపగలే చోరీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కైలాసపట్నం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే చోరీకి దొంగలు తెగబడ్డారు. సిద్ధబత్తుల పోతురాజు ఇంట్లో సుమారు 9తులాల బంగారం, రూ.4వేల నగదు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక సిఐ నారాయణరావు, ఎస్సై నారాయణరావు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ రంగులోకి దించారు. వేలిముద్రలు సేకరించారు. పట్ట పగలు దొంగతనం జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజ్యాంగ దినోత్సవాన్ని విశాఖ జిల్లాలో పలు చోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ లర్పించారు.

ములగాడ : మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు, ప్రముఖ పాత్రికేయులు సుంకర చలపతిరావు, కార్మిక నాయకులు బి.సత్యానందం, ప్రముఖ కవి కె.సత్తిరాజు, మల్కాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని అంబేద్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం జికెవి.రాజు అందరి చేత రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు.

మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జానీస్, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, వై.ప్రేమలత, తులసి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ లా లో రాజ్యాంగ దినోత్సవం, జాతీయ న్యాయదినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ జె.ఉమారావు, కె.లక్ష్మి పాల్గొన్నారు.

బిజెపి ఎస్సీ మోర్చా విశాఖ ఉపాధ్యక్షుడు ఎండ అప్పారావు ఆధ్వర్యాన 7వ వార్డు పరిధి బాపూజీనగర్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాతపూడి ప్రదీప్ కుమార్ హాజరయ్యారు.

ఏయులో : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిపాలనా భవనం, న్యాయ కళాశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పూలమాలలు వేసి నివాళు ర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎపిఇపిడిసిఎల్ అధికారులు

ఆనందపురం : రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఒఎస్‌జి ఫౌండేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ భావిశెట్టి భారతమ్మ, ప్రభుత్వ న్యాయవాది మరుపిల్లి చిన్నయ్య పాత్రుడు ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాజ్యాంగ దినోత్సవ గొప్పతనాన్ని తెలియజేశారు. రక్త శిబిరాన్ని వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ప్రారంభించి నిర్వాహకులకు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. 26 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది పాత్రుడు, ఒఎస్‌జి ఫౌండేషన్ ప్రతినిధి దలాయి శివ, ఉప్పాడ అప్పారావు, మరుపల్లి సాయి జ్ఞానేశ్వరరావు, లావేటి జగన్నాథరావు, మాజీ సైనికులు హరీష్, ముడసల శ్రీను వెంకట్, వంశీ, రాజు, రవి, జగదీష్ భార్గవ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలోని ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు పౌరుల ప్రాథమిక హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గుడిలోవ ఏక్యూజే కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. రాజ్యాంగాన్ని గౌరవించాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏక్యూజె కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆనందపురం ఎస్సీ, బీసీ కాలనీలో సర్పంచ్ చంద్రక లక్ష్మి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

విశాఖపట్నం : జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షైజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన 100 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.మాణిక్య కుమారి, డాక్టర్ జె.నిర్మల నేతృత్వంలో రాజ్యాంగ ప్రవేశికను చదివారు.

ఉక్కునగరం : సృష్టి వరల్డ్ స్కూల్‌లో రాజ్యాంగాన్ని అందించిన మేధావులకు, నాయకులకు నివాళులర్పించారు. విద్యార్థులు రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి.సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభం, ప్రిన్సిపల్ ఇ.చంద్రిక, వైస్ ప్రిన్సిపల్ కావ్యభాయ్, కో ఆర్డినేటర్లు శాంతి, లత, షమీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు, వాలంటీర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.ఉమారాణి, ఎన్ఎస్ఎస్ 1, 2 విభాగాల అధికారులు పి వేణుగోపాల్, కె ప్రసాదరావు పాల్గొన్నారు. చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, రేఖ అప్పారావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజేశ్వరి, డాక్టర్ సత్యవతి, బి రామ స్వామి, మధుర వాణి, రమేష్ పాల్గొన్నారు. పిఎస్ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

టిడిపి ఆధ్వర్యాన తగరపువలస జంక్షన్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, నాయకులు పతివాడ రాంబాబు, గంటా నూకరాజు, పిట్ట సురేష్, బడిగంటి నీలకంఠం, వానపల్లి సత్య, కె.లీలావతి పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యాన భీమిలి ఎఎంసి యార్డు ఎదురుగా ఉన్న అంబేద్కర్ కాలనీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగం లక్ష్మి పాల్గొన్నారు.

ఆరిలోవ: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మేయర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని ఆరిలోవ సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, నాయకులు ఎస్.రంగమ్మ, గౌరి, ఆర్.రమణమ్మ, బి.సూర్యమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లో, ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి కె.రాంబాబు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.రాధ, స్థానిక నాయకులు కోరాడ లక్ష్మణరావు, ఈర్ల ఈశ్వరరావు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో కెకె.రాజు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజినిఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో..

ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజన్‌లోని లక్ష్మీపూర్, రాయగడల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఆర్ఎం అనుప్ సత్పతి హాజరయ్యారు. ఎన్ఎస్‌టిఎల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

ఎపిఇపిడిసిఎల్‌లో..

ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లర్పించారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు సి.శ్రీనివాసమూర్తి, వి.విజయలలిత, ఎం.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ వేడుకల్లో భాగస్వాములయ్యారు.

వైసిపి కార్యాలయంలో..

మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రాజ్యాంగ గొప్పతనాన్ని కొనియాడారు. ఎంపీలు బి.సత్యవతి, ఎంవివి.సత్యనారాయణ, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున జరిగిన వేడుకల్లో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పొడుగు కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, వినతి పత్రం సమర్పించారు. బిజెపి ఎస్సి మోర్చా ఆధ్వర్యంలో సరస్వతి పార్కు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుగు శక్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు బివి.రామ్ పాల్గొన్నారు.

జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో...

ఆనందపురంలో రక్తదాన శిబిరం

ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో...

స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలుచేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలుచేయాలని నూతన కార్మికులు ఆందోళన చేశారు. 2017 నుంచి నూతన వేతనాలు అమలు చేయాల్సి ఉన్నా తాత్సారం చేస్తుండంతో స్టీల్ ప్లాంట్ ఎల్ అండ్ డిసి జంక్షన్ వద్ద వందలాది మంది యువ కార్మికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. గత సంవత్సరం ఎన్‌జెసిఎస్‌లో వేతన ఒప్పందం జరిగిందని, సెయిల్ కర్మాగారాలలో ఇప్పటికే వేతన ఒప్పందం అమలు జరిగి ఏడాది కావస్తుందని, విశాఖ ఉక్కులో మాత్రం అమలుకాలేదని తెలిపారు. ఇన్సెంటివ్‌లో కోత విధించడంతో కొత్త కార్మికులు ముందు ఉన్న జీతం కంటే తక్కువ అందుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఉక్కు యాజమాన్యం స్పందించి వెంటనే పెరిగిన జీతాలను అమలు చేయాలని కోరారు. ఉక్కులో ఉన్న అన్ని యూనియన్‌లు వేతన ఒప్పందం త్వరితగతిన అయ్యేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకోవడంతో పాటుగా కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కూడా కాపాడుకోవాలన్నారు. దీనికోసం భవిష్యత్తులో జరిగే ప్రతి కార్యక్రమానికీ యూనియన్‌లకతీతంగా యువకార్మికులు పాల్గోవాలని యువ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది యువ కార్మికులు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ నూతన కార్మికులు

సచివాలయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం సచివాలయ సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ సింహాచలాన్ని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో కలిసి సచివాలయ సేవలను పూర్తి స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ఉద్యోగులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ సింహాచలం మాట్లాడుతూ 78వ వార్డు సచివాలయం పనులు ప్రారంభించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

తడి - పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి రవినగర్ సమీపంలోని భాష్యం స్కూల్లో తడి -పొడి చెత్తపై 488వ సెంబర్ సచివాలయం ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ కార్యదర్శి అమీర్ మాట్లాడుతూ, మూడు రకాల బిన్లు ఇంటి వద్దకు వస్తాయని, వాటి గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర చెత్త గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలన్నారు. వాటి గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్లాస్టిక్ చాలా ప్రమాదకరమని, దాని తరిమి కొట్టడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఉదాహరణలతో వివరించారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీ రాకేష్ మిత్ర, భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ రాఘవ, సచివాలయ సిబ్బంది, సచివాలయ వాలంటీర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై తోపుడు బండ్లు తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు శంకరమఠం రోడ్డు నుంచి 4వ పట్టణ పోలీస్ స్టేషన్ హైవే వరకు ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండ్లు, హోర్డింగ్‌లను తొలగించినట్లు జోన్-3 టిపిఒ తేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి గోపాలకృష్ణనగర్‌లో పార్కుల అభివృద్ధికి రూ.48 లక్షలతో శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా ఆగలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90 శాతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పూర్తి చేశారని తెలిపారు. కార్పొరేటర్ శానాపతి వసంత మాట్లాడుతూ, వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. పార్కులను కాపాడటం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు శంకరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి -గాజువాక : పేదల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వడ్లపూడి సచివాలయం- 1 పరిధిలోని లబ్ధిదారులకు టిడ్కో గృహాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను గాజువాక జోనల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పైసా ఖర్చు లేకుండా పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. మిగిలి లబ్ధిదారులకు కూడా త్వరలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తామని తెలిపారు. సంక్షేమంతో పాటు, నియోజకవర్గ అభివృద్ధికి కూడా నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సత్యజీత్‌రెడ్డికి కొండబాబు అభినందనలు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐఎన్‌టియుసి జాతీయ యువజన ఉపాధ్యక్షులు జి సత్యజీత్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు నేరపురెడ్డి కొండబాబు అభినందనలు తెలిపారు. బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో జరిగిన యువజన కార్యక్రమంలో ఐఎన్‌టియుసి యూత్ కమిటీ చైర్మన్‌గా సత్యజీత్‌రెడ్డి నియమితులైనట్లు తెలిపారు. అంతర్జాతీయ యువజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ పదవి ద్వారా న్యాయం చేయాలని కోరారు.

శాంతినగర్ కలంజియ సమాఖ్య మహాసభ

ప్రజాశక్తి -కంచరపాలెం : శాంతినగర్ కలంజియ సమాఖ్య మహాసభ శనివారం నిర్వహించారు. ముందుగా శాంతినగర్ నుంచి డిఎల్‌బి గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ జరిగింది. సమాఖ్య పరిధిలో ఉన్న 3500 మంది సభ్యులు పాల్గొన్నారు. అంతా పండుగ వాతావరణంలో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, సభ్యులకు పొదుపు, అప్పు మాత్రమే కాకుండా సాంఘిక భద్రత, వృత్తి శిక్షణ కూడా ఇస్తుండటంపై ధాన్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. ఫిషరీస్ విభాగం ఏడీ కిరణ్ మాట్లాడుతూ, ఫిష్ ఆంధ్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, రమాప్రభ, శైలజ, మురళి, రజిని, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ మాన్యువల్ విడుదల

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రధాన సమావేశ మందిరంలో విజిలెన్స్ మాన్యువల్-2022ను సిఎండి అతుల్‌భట్ శనివారం విడుదలచేశారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ, పారదర్శకమైన పరిపాలనా పనితీరుతో సంస్థలో విజిలెన్స్ కార్యకలాపాల యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఒక సంస్థలోని అన్ని స్థాయిల ఉద్యోగులలో విధానాలు, ప్రక్రియలపై అవగాహన విజిలెన్స్ మాన్యువల్ కలుగ చేస్తుందన్నారు. ఉమ్మడి లక్ష్యాలు, లక్ష్యాలను సాధించడంలో దోహద పడుతుందని తెలిపారు. తద్వారా సంస్థ తన వ్యాపారంలో రాణించేలా చేస్తుందని పేర్కొన్నారు.

చీఫ్ విజిలెన్సు ఆఫీసర్ బి.విశ్వనాథ్ మాట్లాడుతూ, సంస్థ నిర్దిష్ట విజిలెన్స్ మాన్యువల్ యొక్క ఆవశ్యకతను వివరించారు. విజిలెన్సు మాన్యువల్‌ను క్రమ పద్ధతిలో అప్‌డేట్ చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐఎన్‌ఎల్ డైరెక్టర్లు, సీనియర్ అధికారులు, ఆర్‌ఐఎన్‌ఎల్ విజిలెన్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ సమస్యలు-పరిష్కారాలపై ఈనెల 29వ తేదీన మాధవ స్వామి కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం జరగనుండటంతో ముందస్తుగా వైసిపి సమన్వయకర్త ఆధ్వర్యాన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు, ఇతర పనుల గురించి చర్చించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలుగులో కార్పొరేటర్ శ్రావణి తదితరులు

వంతెన వద్ద వీధి లైట్లు

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి శంకరమఠం రోడ్డులో 80 అడుగుల రహదారి వద్ద రామకృష్ణ నగర్‌కు వెళ్లే వంతెన వద్ద వీధి దీపాలు వేశారు. వంతెన వద్ద వీధి లైట్లు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్కా శ్రావణి తెలిపారు. ఆయన స్పందించడంతో లాల్ బహదూర్ శాస్త్రి పార్క్‌లో రెండు వైపులా లైట్లు వేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్, సెక్రటరీ పి.లక్ష్మణ, వార్డు టిడిపి నాయకులు కొత్తూరు శ్రీను, పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు సన్మానం



పూలమాలతో సన్మానిస్తున్న అండిబోయిన లక్ష్మి, అప్పారావు

ప్రజాశక్తి -గాజువాక : నేపాల్‌లో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గాజువాకకు చెందిన ధర్మతేజ, రమేష్ యాదవ్ బంగారు పతకాలు సాధించడంపై వారిని స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం గాజువాకలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ పోటీల్లో సీనియర్ విభాగంలో 83 కేజీల కేటగిరిలో ధర్మతేజ, 93 కేజీల కేటగిరిలో రమేష్ యాదవ్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షులు అప్పారావు మాట్లాడుతూ, జనవరి నెలలో అసోసియేషన్ తరపున నేషనల్ మీట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడాకారులందరూ సిద్ధం కావాలని కోరారు. గెలుపొందిన క్రీడాకారులకు అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -పిఎం పాలెం: శిల్పారామం వేదికగా రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ అమేచూర్ తైక్వాండో అసోసియేషన్ పర్యవేక్షణలో వైజాగ్ అమేచూర్ తైక్వాండో సంఘం, ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ సెంటర్స్ సంయుక్తంగా ఈ పోటీలను ఈ నెల 26, 27 తేదీలలో శిల్పారామం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా నార్త్ జోన్ ఎసిపి చుక్క శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 200 మంది తైక్వాండో క్రీడాకారులు తలపడనున్నారు. బాల, బాలికలకు వేర్వేరుగా సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో శరీర బరువు ఆధారంగా పోటీలు జరగనున్నాయి అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఏసుపాదం, సిఐ వై.రామకృష్ణ, సునీల్ మహంతి, మొల్లి లక్ష్మణ, ఈశ్వరి ప్రభాకర్ పాల్గొన్నారు.

దంత వైద్యులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : దంత వైద్యులు నైపుణ్యాలను పెంచుకోవాలని, సంపాదన కోసం అవసరంలేని చికిత్సల జోలికి పోకూడదని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్‌రెడ్డి సూచించారు. గీతం దంతవైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైద్య వృత్తిని ఆదాయం సంపాదించే కోణంలో చూడకుండా మనిషి ప్రాణాలు నిలపడానికి లభించిన అవకాశంగా భావించాలని ఉద్బోధించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ దంత వైద్యంలో పరిశోధనలపై దృష్టి సారించాలని, గ్రామాల్లో అవకాశాలను ఉపయోగించుకుని ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు.


పంచకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాశీవిశ్వనాథం

పంచకర్లకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సీతమ్మధారలోని ఆయన కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథం మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

రాజేశ్వరికి ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి -పిఎం పాలెం: జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం పాలెంలో శనివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 విశాఖపట్నం కాన్ఫరెన్స్ 2022 సందర్భంగా ఫ్రెండ్స్ వనిత వాకర్స్ క్లబ్‌కు చెందిన దాసరి రాజేశ్వరికి ఉత్తమ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ, వేముల దేవి స్మారక అవార్డు పెద్దల చేతుల మీదుగా తీసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

వెంకటేశ్వర ఆలయంలో జర్మనీ వాసులు

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం జర్మనీ దేశస్థులు సందర్శించారు. సాగరానికి అభిముఖంగా నిర్మించిన ఈ శ్రీవారి ఆలయం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు.

పంటల గిట్టుబాటు ధర చట్టం తేవాలి

అఖిలపక్ష రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర చట్టం తేవాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో శనివారం అఖిలపక్ష రైతు సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పంటల గిట్టుబాటు ధర చట్టం, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు రద్దుపై మోడీ హామీ ఇచ్చి ఏడాదైనా నేటికీ దానిని అమలు చేయలేదన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా అన్ని గవర్నర్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏఐకేసి పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఢిల్లీలో రైతుల పోరాటంతో దిగొచ్చిన మోడీ సర్కారు మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. విద్యుత్ బిల్లు రైతు సంఘాలతో చర్చించిన తర్వాతే పార్లమెంటులో ప్రవేశపెడతామని చెప్పి నేడు దొడ్డిదారిన సెలెక్ట్ కమిటీకి పంపడం దారుణమన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగ పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా రెండో దశ పోరాటానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కర్రి అప్పారావు (ఎపి రైతు సంఘం), ఎ.బాలకృష్ణ (కౌలు రైతు సంఘం), ఆర్.శంకరరావు (సిఐటియు), బి.ఉమామహేశ్వరరావు (వార్వా), బుద్ధ రంగారావు (నిర్వాసితుల సంఘం) బి.నూక అప్పారావు (ఎన్‌పిఆర్‌డి), కె.శంకర్రావు (రైతు సంఘం), ఆర్డీఎస్.అప్పారావు, యు.సూర్యనారాయణ (గోపాలమిత్ర సంఘం) తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు

మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

గ్రామ సచివాలయాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం గ్రామ సచివాలయాలను జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సచివాలయాల సిబ్బంది పనితీరును, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు. అమృతపురం, గొల్లలపాలెం గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తవ్వవానిపాలెం సచివాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ నాయుడు, ఈఓపిఆర్డీ మహేష్ సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, బైలపూడి గౌరి, మోపాడ అప్పారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బహుమతులతో విజేత విద్యార్థులు

ముగిసిన క్విజ్, పోస్టర్ మేకింగ్ పోటీలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట డిపిఎన్ బాలురు హైస్కూల్‌లో భారతీయ విజ్ఞాన మండలి, ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ మేకింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లాలోని 36 హైస్కూల్ నుండి 108 మంది 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి పెదముషిడివాడ పాఠశాల, ద్వితీయ బహుమతి వేములుపూడి ఎపిఎంఎస్, తృతీయ బహుమతి కశింకోట కెజిబివి, పోస్టర్ మేకింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి చెట్టుపల్లి పాఠశాల, ద్వితీయ బహుమతి దేవరాపల్లి పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చిట్టిబాబు, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీధరరెడ్డి, కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ పార్థసారథి, జిపిఎస్ నాయుడు, విశ్రాంత ఉద్యోగి జివి అప్పారావు పాల్గొన్నారు.

9న చెరుకు క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం

ఈ ఏడాది చెరుకు క్రషింగ్ సీజన్‌కు అగ్రిమెంట్‌కు మించి చెరుకు తీసుకుంటామని కేన్ డెవలప్మెంట్ ఆఫీసర్ కే.రాము తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండలంలో తట్టభంద చెరుకు కేంద్రం వద్ద రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 9న గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు క్రషింగ్ ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్కు అగ్రిమెంటుకు మించి రైతుల వద్ద చెరకును తీసుకోవడం జరుగుతుందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.గత ఏడాది ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చెరుకుకు సంబంధించి బకాయిలు క్రషింగ్‌కు ముందే రైతుల ఖాతాలలో సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ సమావేశంలో చెరుకు కేంద్రం ఫీల్డ్‌మ్యాన్ కంచిపాటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాకలో పలువురికి సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలో శనివారం ఎంపీటీసీ దంపతులను, మరికొంత మంది మహిళా సేవకులను అయ్యప్పస్వామి దీక్షా పీఠంలో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ కొల్లాటి పార్వతి, కొల్లాటి బుజ్జి దంపతులు అయ్యప్పస్వాములకు బిక్ష ఏర్పాటు చేయడంతో ఉపమాక దుర్గాభవానీ పీఠం తరపున సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఎంపీటీసీ దంపతుల సేవలను శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి వెంకట రమణ, గురుభవానీ రాంబాబు ప్రశంసించారు. సేవా కార్యక్రమాలు చేసిన మత్తుర్తి గణేశ్వరి, పొన్నాడ సుబ్బలక్ష్మి, కేశనకుర్తి కామేశ్వరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మత్తుర్తి మణికంఠ పొన్నాడ ప్రసాద్. కోరుకొండ నూకేశ్, పొన్నాడ నానాజీ తదితరులున్నారు.

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు, రాము, కార్మికులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

డిసెంబర్ 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభ పోస్టర్‌ను శనివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, వారి సమస్యలను పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. మరో వైపు కార్పొరేట్ కంపెనీలకు కార్మిక హక్కులను తాకట్టు, ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మిక పోరాటాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. వీటిపై ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. డిసెంబర్ 18న బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఇందులో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లాలోని కార్మికులు, స్కీమ్‌వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సుంకర సూరిబాబుకు ఘన నివాళి

సూరిబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంటా, ఇతర నేతలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర సూరిబాబు సంస్మరణ కార్యక్రమం శనివారం బుచ్చయ్యపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కెఎస్ఎన్ఎస్.రాజు, గవిరెడ్డి రామానాయుడుతో పాటు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొని సూరిబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సూరిబాబు భార్య లక్ష్మి, కుమారుడు రాకేష్, కుమార్తె లావణ్యను ఓదార్చారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుంకర సూరిబాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ మంచి చేయాలనే సంకల్పం ఉండే సూరిబాబు మృతి గ్రామానికి లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ ఆడారి ఆనందబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర విఆర్వోల సంఘం మాజీ అధ్యక్షులు ఈర్ల శ్రీరామ్మూర్తి, జనసేన నాయకులు పిబిఎస్ఎన్ రాజు, రమేష్, నియోజకవర్గంలో పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో చోద్యం గ్రామానికి సమీపంలో ఉన్న బొడ్డేరు గెడ్డ పరివాహక ప్రాంతంలో చేస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బొడ్డేరు గెడ్డ పరివాహక ప్రాంతంలో బ్రిడ్జి సమీపం, తాగునీటి మంచినీటి పథకాలకు సమీపంలోను తవ్వకాలు చేపట్టడంతో తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ తవ్వకాల కారణంగా గెడ్డకు అనుకుని ఉన్న సాగు భూములకు కోత ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. సాగు రైతులు గ్రామ రెవెన్యూ కార్యదర్శికి, గొలుగొండ రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-కశింకోట : లింగ వివక్షకు వ్యతిరేకంగా కశింకోటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి మాట్లాడుతూ లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా గ్రామ స్థాయిలో స్వయం సహాయక సంఘాలతో అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆడపిల్లలపై అత్యాచారాలు, అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. మహిళా చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంత్రి జయరజనీ, వైసిపి నాయకులు పెంటకోట శ్రీనివాసరావు ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు, పంచాయతీ ఆఫీసర్ రమేష్, సీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెడ్ షీట్లు, పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శనివారం రోగులకు బెడ్ షీట్లు, బాలింతలకు పళ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉలిగల రమేష్, కృష్ణ, గంటా యువసేన ప్రతినిధులు జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన గంగాధర్, ఆండ్ర ప్రసాద్, కరణం గోవింద, కడింశెట్టి ప్రసాద్, కడియాల ప్రసాద్ పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని 22వ సచివాలయ పరిధిలో దోమల నిర్మూలన, డెంగీ, మలేరియా నివారణ, వాటి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రం గా ఉంచడంతోనే డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. పల్లపు వీధిలో కోటి రూపాయలతో నిర్మించిన ఆసుపత్రిని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి రజిని మాట్లాడుతూ ప్రతి ఇంటిలో తడి, పొడి, హానికర చెత్త డబ్బాలను విధిగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ వేణుగోపాల్, ఏఈ సుమిత్ర, వాటర్ వర్క్స్ ఎఇ కేదార్నాథ్, వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, పెంటకోట అప్పలనాయుడు, బొడ్డేడ రాజు, పెంటకోట రూప్ తేజ, పెంటకోట సన్యాసినాయుడు, మద్దాల వాసు, మద్దాల శివ నాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నీలిమ తదితరులు

రైతులు, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డిఎస్‌పి సునీల్

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి -చోడవరం : ఇసుక, గ్రావెల్ వంటివి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి డిఎస్‌పి బి.సునీల్ అన్నారు. శనివారం మండలంలోని జన్నవరం గ్రామంలో సమావేశం నిర్వహించారు. మండలంలో చాలాచోట్ల ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు ప్రతి గ్రామంలోనూ గ్రామ పెద్దలతో సహా అక్రమ రవాణాదారులను బైండోవర్ చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమించి రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామపెద్దలు రవాణాను అరికట్టేందుకు సహకరించాలన్నారు. ఆదివారం గవరవరం, లక్కవరం, నర్సాపేట గ్రామస్తులు సుమారు 40 మందిపై బైండోవర్ చేసామని స్థానిక సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని దేవరాపల్లి, రైవాడ రైతు భరోసా కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసిన ఏర్పాట్లును పరిశీలించారు. ఆయా గ్రామాలలో రైతులతో మాట్లాడారు. వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, బయట దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఆమె వెంట తహశీల్దార్ ఎం.లక్ష్మి, వీఆర్వో నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దళిత, గిరిజనుల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి- కె.కోటపాడు : దళితులు, గిరిజనులపై సమస్యలపైనా పోరాటం చేస్తానని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాద్ తెలిపారు. ఇటీవల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దళిత, గిరిజనులు, ఆ తరగతుల మహిళలపై ఎటువంటి దాడులు, హింస, వేధింపులు, అత్యాచారాలు, హత్యలు జరిగినా వారికి అండగా ఉండి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. ప్రతి దళిత కుటుంబానికి 2 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ చేసిన స్టీల్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విశాఖ స్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్‌లో హెచ్‌ఓడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎంఎస్ కుమార్‌ను వనపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ తరపున అధ్యక్షులు గొంప నరసింహనాయుడు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా క్రీడా రంగానికి కుమార్ చేసిన సేవలను గుర్తు చేశారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ, పాటిపల్లి పంచాయతీల పరిధిలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్లను హౌసింగ్ డే సందర్భంగా ఎంపిడిఓ, తహశీల్దారు, ఇఒపిఆర్‌డి హౌసింగ్ డిఇతో కూడిన బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా అధికారులు లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల సర్పంచులు ఆడారి కృష్ణవేణి, దొడ్డి మంగవేణి కాలనీలోని మౌలిక సదుపాయాలు, చేపట్టాల్సిన పనుల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసీ కాంగ్రేగుల వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు ఆడారి త్రిమూర్తులు, దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

3 నుంచి గుంటూరులో అగ్రిటెక్ ప్రదర్శన

ప్రజాశక్తి-అనకాపల్లి, బుచ్చయ్యపేట

ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులో అగ్రిటెక్-2022 ఆధునిక సాంకేతికతపై ప్రదర్శన, కిసాన్ మేళ జరుగుతుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు, బుచ్చయ్యపేట మండలం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్ తెలిపారు. ఆర్ఎఆర్ఎస్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో జగన్నాథరావు మాట్లాడగా, రాజ్‌కుమార్ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 10వేల మంది ఈ ప్రదర్శన, మేళ్లకు హాజరవుతారని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి సుమారు 250 మంది ఆదర్శ రైతులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులపై 300 నుంచి 400 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ విధానాలు, సహకార, ఇతర బ్యాంకింగ్ సేవలు, మెకనైజేషన్ యాక్సిస్బిలిటీ ఫార్మర్స్, రైతులు శాస్త్రవేత్తల చర్చ గోష్టి, వ్యవసాయ, ఉద్యానవన సమీకృత వ్యవసాయ విధానం, రైతులు మార్కెట్ లింకేజీ, సీడ్ ప్రొడక్షన్, క్రిమిసంహారక మందులు, సేంద్రీయ వ్యవసాయ విధానం, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యంత్రాలు, పంటకోత అనంతర విధానం, రోబోటిక్ అగ్రికల్చర్ ఆపరేషన్, రైతు భరోసా కేంద్రాల సేవలు, రైతు ఉత్పత్తి సంఘాలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లి నుంచి బెల్లం ఉత్పత్తులపై స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్నాథరావు

స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

శ్రీను చిత్ర వద్ద నివాళులర్పిస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి-వడ్డాది : చదువుకునే రోజుల్లో ఆటపాటల్లోనే కాదు జీవితంలో కష్టసుఖాల్లోనూ తోడుంటామని నిరూపించారు వడ్డాది హైస్కూల్లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. వీరితో పాటు చదువుకున్న మండలంలోని విజయరామరాజుపేటకు చెందిన మాడెం శ్రీను ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న హైస్కూల్ మిత్రులు రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం శ్రీను భార్యకు అందజేశారు. పిల్లలను బాగా చదివించి తమ స్నేహితుడు లేని లోటు తీర్చాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, కృష్ణ, శంకర్, జోగారావు, తలుపుల నాయుడు, కర్రి గణేశ్, ముత్యాల నాయుడు, హరి, సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

అత్యాచారాలు, హింసను అరికట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళలపై అత్యాచారాలు, హింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికట్టాలని దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామలమ్మ అన్నారు. స్థానిక ఆదినారాయణ మహిళా కళాశాలలో శనివారం జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి, న్యాయవాది వల్లభాపురం యశస్విని, ఏఎస్ఐ మణికుమారి దిశ చట్టం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రూప, సిడిపిఒ ప్రభావతి, జిల్లా కో-ఆర్డినేటర్ నిఖిత, డొమెస్టిక్ వైలెన్స్ కౌన్సిలర్ జ్యోతి, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సర్వేయింగ్ వర్క్ షాప్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్‌లో పదిరోజులుగా జరుగుతున్న 'టోటల్ స్టేషన్ సర్వేయింగ్ వర్క్ షాప్' శనివారం ముగిసింది. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వేయింగ్‌లో మెళకువలు, సివిల్ ఇంజినీరింగ్‌లో ఆటో కేడ్ సాఫ్ట్ వేర్ ఉపయోగాలు వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి మోహనరావు, లాలం సత్తిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -రావికమతం :రావికమతం నుంచి కింతలి కు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చితుప్పలను అధికారులు శనివారం తొలగింపు చేపట్టారు. చినపాచిల నుంచి కొమిర మీదుగా బుడ్డిబందకు వచ్చే రోడ్డు ఇరువైపులా ఉన్న పిచ్చితుప్పలను తొలగించారు.

రోడ్డును శుభ్రం చేయించిన కార్పొరేటర్

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి లంకెలపాలెం జంక్షన్‌ను, జాతీయ రహదారిని ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ధూళి క్లీనర్‌తో క్లీన్ చేయించారు. ఈ ప్రాంతంలో బొగ్గు బూడిద, ధూళి అధికంగా ఉండటంతో శుభ్రం చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎంఎఎ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.30 వేలు విలువ చేసే క్రీడ సామాగ్రిని శనివారం పాఠశాలకు అందజేశారు. విద్యార్థులు వివిధ క్రీడల్లో తర్ఫీదు పొంది రాష్ట్ర జాతీయ స్థాయిలో పాఠశాలకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరిబిల్లి లావణ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్ష కరస్పాండెంట్లు మళ్ల సత్యనారాయణ, శ్రీధరాల కృష్ణ పేర్రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు మణి కుమారి, పి.శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం వద్ద శనివారం విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వైసిపి నాయకులు దాట్ల శివాజీ రాజుతో పాటు పలువురు మఠం వద్ద పూజలు నిర్వహించారు. రొంగలి సూర్యనారాయణ సమకూర్చిన బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహాలను కమిటీ సభ్యులకు అందజేశారు. మేళతాళాలు, డప్పులు, చిడతలు, భజనలతో గ్రామంలో ఊరేగించి, అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాజు మోది నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ :స్థానిక వేములపూడి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కౌశల్ క్విజ్ జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని కైవశం చేసుకున్నారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. ఈ విద్యార్థులు డిసెంబర్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.



బాధితులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన టేకుమళ్ల రాజేశ్వరి, కన్నంరెడ్డి నాగేశ్వరరావు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. వీరి వైద్య ఖర్చులతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రాజేశ్వరికి లక్ష రూపాయలు, నాగేశ్వరరావుకు రూ.32వేలు మంజూరు కాగా, ఆ చెక్కులను బూడి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆరోగ్య శ్రీ పథకం వర్తించని సాధారణ కుటుంబాల వారికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారికి అండగా ఉంటున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకట రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

27వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎనిమిది గ్రామాల ప్రజలు నేవీ మెయిన్ గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నేవీ వల్ల సర్వం కోల్పోయిన తమను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, జీవన భృతి కల్పించాలని, పెండింగ్ ప్యాకేజీలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో8 8 గ్రాముల జెఎసి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి శంకుస్థాపన చేశారు. శనివారం స్థానిక డాన్ బాస్కో కాలేజీ ప్రధాన గేటు నుండి సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ప్రాధాన్యత క్రమంలో వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. అనంతరం మున్సిపాలిటీలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శెట్టి విజయాంబ, పార్టీ నాయకులు శెట్టి మోహన్, గవిరెడ్డి స్వామినాయుడు, డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

రబీకి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో రబీకి సాగుకు మినుములు, పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ అధికారి. చిరంజీవి తెలిపారు. మినుములు 30 క్వింటాలు, పెసర్లు 30 క్వింటాలు, వేరుశనగ 2 క్వింటాలు మండలానికి వచ్చాయని తెలిపారు.

వివేకానంద విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్వామి వివేకానంద ఆశయాలను అందరికి ఆదర్శమని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో ఏపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని శనివారం ఎంపిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. 'స్వామి వివేకానంద సూక్తి - యువతకు స్ఫూర్తి' అనే పుస్తకాన్ని దేన్ స్వచ్ఛంద సంస్థ అధినేత దొగ్గ అచ్చింనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, ఏపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు బి.ఈశ్వరరావు, వెంకటేష్, ఎలమంచిలి ధర్మారావు, వేగి రామారావు, దాట్ల శివాజీరాజు, భూపతి అప్పలరాజు, కుంచ అంజిబాబు, నంబారు అప్పారావు పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిపి

రాజ్యాంగ స్ఫూర్తితో పని చేయాలి

◆కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ◆ ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రవిపఠాన్‌శెట్టి

జిల్లాలోని పలు మండలాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా వైసిపి ప్రభుత్వం పాలిస్తుందని టిడిపి నేతలు అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

అనకాపల్లి:రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి విధి అని, రాజ్యాంగ స్ఫూర్తితో పని చేయాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమి సాలి సిబ్బందితో కలసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, ఎఎంఎఎల్ కళాశాలలో ప్రిన్సిపల్ జయ బాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ చెల్లా నరసింహం పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.చిన్నమ్మాయి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు పాల్గొని ప్రసంగించారు.

కశింకోట : ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ మంత్రి జయరజనీ పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ జెడ్పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు నివాళు లర్పించారు.

వడ్డాది : వడ్డాది కస్తూరిబా పాఠశాల, ఎంపీపీ మెయిన్ స్కూల్, బంగారు మెట్ట, లోపూడి పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్ఎంలు టివి.శేషగిరి, పివి .శేషుబాబు సిహెచ్.దుర్గ భవాని పాల్గొన్నారు.

దేవరపల్లి : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట, మడుతూరు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తట్టా శ్రీనివాసరావు తన సొంత నిధులతో చీరలు, పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు.

పరవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు. పరవాడ బాలికల హాస్టల్, వాడచీపురుపల్లి, సమ్మంగపాలెం గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్‌డి రాజు, ఈరుగుల లక్ష్మీప్రసాద్, చంద్రరావు నివాళు లర్పించారు. పరవాడ ఎన్టీపిసి సింహాద్రిలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సింహాద్రి సిజిఎమ్ నిసి చౌక్, జిఎం ఆర్‌కె జు రాజ్యాంగ ప్రవేశికను ఉద్యోగులతో కలిసి చదవారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. హెచ్ఎం బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అప్పారావు జగదీశ్వరి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు టిడిపి వినతులు

చోడవరం : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక భీముని గుమ్మం అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేత సబ్బవరపు గణేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

వడ్డాది : వైసిపి ప్రభుత్వం నవరత్నాలు పేరుతో దళితులను మోసం చేస్తుందని టిడిప్లి ఎస్సీ సెల్ జిలా అధ్యక్షులు కోరుకొండ గురుమూర్తి ఆరోపించారు. వడ్డాది హరిజన కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం : సిఐటియు

పరవాడ : భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ పరిరక్షించుకోవాలని, రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ దినం సందర్భంగా పరవాడలో శనివారం పరవాడ బాలికల హాస్టల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల అమలు కోసం అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు.. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు వెన్నెల లక్ష్మి, బి ముత్యాలమ్మ, పి జయలక్ష్మి, వెంకటరత్నం, అక్కులమ్మ, పరదేశమ్మ, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం నర్సీపట్నం అబీద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, వైసీపీ నాయకులు అంబేద్కర్ కు నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ ఆదిలక్ష్మి కనకారావు నివాళు లర్పించారు. మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, నాయకులు గుడబండి నాగేశ్వరరావు, ఆరుగొల్లు రాజుబాబు, మామిడి శ్రీను, అయ్యకర కార్పొరేషన్ డైరెక్టర్ కనకమహాలక్ష్మీ, పాల్గొన్నారు. గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని లైబ్రేరియన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దార్ అన్నాజీరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చెట్టుపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో రాష్ట్ర రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎర్రశెట్టి పాపారావు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజాల నాగరత్నం సూరి బాబు, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఈన్నం రత్నం రమణ, జనసేన అధ్యక్షులు చక్రవర్తి, పాల్గొన్నారు.

చీడికాడ:చీడికాడ, జి.కొత్తపల్లి, కండివరం గ్రామాలలో అధికారులు, నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. చీడికాడలో ఎంపీపీ కురచ జయమ్మ నారాయణమూర్తి, వైసీపీ మండల కన్వీనర్ జి రాజబాబు, నాయకులు ఎర్ర అప్పారావు, జి కొత్త పల్లిలో పంచాయతీ కార్యదర్శి గోపి మాట్లాడారు. వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు, డైరెక్టర్ పరవాడ రామారావు, రమణ పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల: పలు పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక అధికారి సరితా దేవి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వెంకటాపురం పాఠశాలలో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకున్నాయి.

పాయకరావుపేట: దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహించారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహంకు పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్, పార్టీ అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు దువ్వాడ దావీదులు పూల మాలలు వేశారు. పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు.అన్నపూర్ణ, పాయకరావుపేట టౌన్ ప్రెసిడెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో గ్రామ సర్పంచ్, వైసిపి మండల మహిళా అధ్యక్షురాలు లోచల సుజాతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎంపీటీసీలు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, మాజీ ఎంపిపి బివి.రమణ పాల్గొన్నారు.

మాకవరపాలెం: తామరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి. సర్పంచ్ చెల్లారత్నం, వైస్ ఎంపీపీ. రుత్తల లక్ష్మి పూలమాల వేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు హరిబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటనారాయణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద సిఐ నారాయణరావు, ఎస్ఐ శిరీష రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. నక్కపల్లిలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు, చిన దొడ్డుగల్లులో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎస్.రాయవరం:అడ్డురోడ్డులో భారత రాజ్యాంగ దినోత్సవ అవగాహనా సదస్సులో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుని రాజకీయాల వైపు యువత రావాలని సూచించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమార్

హక్కులను కాలరాస్తున్న జగన్

- టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కుమార్

ప్రజాశక్తి-మాడుగుల: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు పరిపాలించే హక్కు లేదని టిడిపి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పివిజి కుమార్ తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం మాడుగులలో రాష్ట్ర పరిపాలనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలన చేయకుండా రాజారెడ్డి పరిపాలన చేస్తున్న వైసిపి అరాచకాలను ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ పేద ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్న వైఎస్ జగన్కు పరిపాలించే నైతిక హక్కు లేదని ఆరోపించారు. కోర్టు తీర్పులను ధిక్కరించే ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఎవరూ లేరని ఆయన వైయస్ జగన్ ఒకరు మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బవరపు రామునాయుడు, పేరపు కొండబాబు, గొల్లవిల్లి శ్రీరామమూర్తి, రంజిత్ వర్మ, మరువాడ ఈశ్వర రావు, పుప్పాల రమేష, కసిరెడ్డి అప్పలనాయుడు, నాయకలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

సిహెచ్‌సిలో సౌకర్యాలు కల్పించాలి

- జెడ్‌పిటిసి ఉమాదేవి

ప్రజాశక్తి-కోటవురట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)కి మెరుగైన సౌకర్యాలు కల్పించి వైద్య సేవలు అందించాలని జెడ్‌పిటిసి ఉమాదేవి కోరారు. జిల్లా పరిషత్ సమావేశంలో శనివారం జరిగిన జెడ్‌పి సమావేశంలో పలు సమస్యలను ఆమె ప్రస్తావించారు. హెల్త్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు.పరిశుభ్రమైన తాగునీరు అందక పోవడంతో పాటు రోగులకు కుర్చీలు, ఫ్యాన్లు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకువెళ్లారు.

మాట్లాడుతున్న ఉదయశ్రీ

జగనన్న కాలనీల సందర్శన

ప్రజాశక్తి-కోటవురట్ల:ఎండపల్లి, జల్లూరు, సుంకపుర్, గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలను శనివారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సందర్శించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు కాలనీ వద్ద ఎదుర్కొంటున్న సమస్యలు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ జగదీశ్వరరావు, పిఆర్ జెఇ వర్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:

మండలంలోని గణిత, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రాం(లిప్) శిక్షణా తరగతులు నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి మూర్తి తెలిపారు. శనివారం కొరుప్రోలు, ధర్మవరం అగ్రహారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో వర్చువల్ శిక్షణా తరగతులను మండల విద్యాశాఖ అధికారి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఎస్వీ రమణారావు సూర్యనారాయణ, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌లు వి.నూకరాజు, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎపి పునర్విభజన చట్టాన్ని అమలు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :ఎపి పునర్విభజన చట్టాన్ని అమలు చేయాలని విశాఖలోని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. పునర్విభజన చట్టంపై మద్దిలపాలెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 2014లో పార్లమెంటు సాక్షిగా ఎపి పునర్విభజన చట్టాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. దీనిలో భాగంగా ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. నాడు ఎపికి 5 సంవత్సరాలు కాదు.. పదేళ్లు పాటు ప్రత్యేక హోదా ఉండాలని ప్రతిపక్షంలో ఉన్న బిజెపి డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా కల్పిస్తామన్న ఆ పార్టీ నేటి వరకూ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, నిధులు కేటాయించడం లేదన్నారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్‌ను 2019లో ప్రకటించినా అది కాగితాలకే పరిమితమైందన్నారు. పైగా సంవత్సరానికి సుమారు రూ.8500 కోట్లు ఆదాయం సమకూరుస్తున్న వాల్తేరు డివిజన్‌ను రాయఘడకు తరలించడం దారుణమన్నారు. ఎపి పునర్విభజన చట్టంలోని ఇతర అంశాల అమలుపై నిర్లక్ష్యం కొనసాగుతోందని మండిపడ్డారు. ఈ నెల 11,12 తేదీల్లో విశాఖ పర్యటన సందర్భంగానైనా ప్రధాని నరేంద్ర మోడీ విభజన హామీలపై ప్రకటన చేస్తారని ప్రజలు భావించినా నిరాశే ఎదురైందని అన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తుంటే ఐక్యంగా నిలదీయవలసిన ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలు తమ రాజకీయ ప్రయోజనాలు చూసుకుంటున్నాయని తెలిపారు. తమలో తాము కలహించుకోవడం తప్ప అసలు ద్రోహి అయిన బిజెపిని పల్లెత్తు మాట కూడా అనడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎపి పునర్విభజన చట్టంలోని అంశాల అమలుకు పోరాటానికి సిద్ధపడాలని సమావేశంలో పాల్గొన్న నేతలంతా తీర్మానించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎం.మన్మధరావు, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రియాంక, నాయకులు కె.కుమారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్‌ఎన్.రాజు, కె.సంతోష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఎపి రజకవృత్తిదార్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విరాళం అందజేస్తున్న సూర్యమణి

అల్లూరి విజ్ఞాన కేంద్రానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : ఎల్ఐసి విశ్రాంతి ఉద్యోగి ఎం.సూర్యమణి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రానికి రూ.లక్ష భూరి విరాళాన్ని విజ్ఞాన కేంద్రం కోశాధికారి వివిఎస్.పద్మనాభరాజుకు శనివారం అందజేశారు. సూర్యమణి తల్లిదండ్రులైన ఎం.లక్ష్మి, ఎం.జానకిరావుల జ్ఞాపకార్థం అల్లూరి విజ్ఞాన కేంద్రానికి ఈ మొత్తం అందజేసినట్లు తెలియజేశారు. విజ్ఞాన కేంద్రంలో ఉచిత సేవా కార్యక్రమాలు, నిరుద్యోగులకు ఉచిత శిక్షణలు, బాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం ద్వారా జరిగే కార్యక్రమాలను ప్రోత్సహించి విరాళాన్ని అందించిన సూర్యమణి కుటుంబానికి పద్మనాభరాజు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలావతి

లోక్‌అదాలత్‌లతో సమస్యల పరిష్కారం

సీనియర్ న్యాయమూర్తి లీలావతి

ప్రజాశక్తి-గొలుగొండ:చిన్న చిన్న తగాదాలను లోక్ అధాలత్‌లో పరిష్కరం చేసుకోవడంతో ఎంతో మేలు జరుగుతుందని నర్సీపట్నం సీనియర్ న్యాయమూర్తి లీలావతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న తెలిపారు. జోగుంపేట జంక్షన్‌లో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి అనేక హక్కులు కల్పించడం జరిగిందని, వాటిని బాధ్యతగా ఉపయోగించుకోవాలన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించడంతో మరికొంత మందికి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొలుసు నరసింహమూర్తి, గంగాధర్, ఎస్‌బిఐ బ్యాంక్ అధికారులు, ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

బియ్యం అందజేస్తున్న రమణ

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలోని అప్పలరాజుపురం లో శ్రీ లలితా దేవి వృద్ధాశ్రమానికి మంచాల గ్రామానికి చెందిన పాటూరి రమణ 25 కేజీల బియ్యాన్ని శనివారం నిర్వాహకురాలు యాళ వెంకటలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, తన మనమడు రెడ్డి రామచంద్రరావు నాయుడు పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి ఈ బియ్యాన్ని అందజేశానన్నారు.

గృహాలను సత్వరం పూర్తి చేయాలి

ఆర్‌డిఒ జయరామ్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలోని గబ్బాడ, నీలంపేట గ్రామాల్లో స్థానిక ఆర్‌డిఒ జయరాం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ నవరత్నాలు, జగనన్న కాలనీ పనులపై ఆరా తీశారు. ఇల్లు నిర్మించుకునే విధంగా లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. నవరత్నాలు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన స్థలాల్లో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను సూచించారు. లేవుట్‌లో ఎంతమందికి ఇంటి పట్టాల వివరాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌లను సరఫరా చేసేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమణ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

సంపద తయారీ కేంద్రంతో ఆదాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఇంచార్జ్ ఎంపీడీవో వెంకట నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంపద తయారీ కేంద్రం ద్వారా పంచాయతీకి ఆదాయం సృష్టించుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి నరసింగరాజుకు సూచించారు. పారిశుధ్య నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని తెలిపారు. సచివాలయ, రైతు భరోసా నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. సకాలంలో పూర్తి చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపిడిఒ

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-నక్కపల్లి: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. మండలంలోని వేంపాడు రైతు భరోసా కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలుపై రైతులకు, వాలంటీర్లకుకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, ఆర్‌బికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పంట నమోదు చేసుకున్న రైతుల కు ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2040లు, సాధారణ రకమునకు రూ.2060 లు చెల్లించనున్నట్లు తెలిపారు. కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. దళారులు, మధ్యవర్తులు చేతుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల ఉప తహశీల్దార్ అప్పల నాయుడు, వీఆర్వో చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఆర్‌బికే సిబ్బంది కంబాల రాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం పుష్యరాగం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విధ్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల ప్రదర్శనను ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వల్లీ, కామేశ్వరి, గుణవతి, శ్రీదేవి, ప్రమీల, ఉమ పాల్గొన్నారు.

నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సూరిబాబు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-గొలుగొండ:బడుగు బలహీన వర్గాల గిరిజన ప్రాంతం ఆశాజ్యోతి కామ్రేడ్ మేకా సూరిబాబు అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి కొనియాడారు. కేడిపేటలో సిపిఐ నేత మేకా సూరిబాబు 35వ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ అమరవీరులందరికీ స్థూపం వద్ద జోహార్లు అర్పించారు. అమరవీరుల వార్షికోత్సవ సభ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మాకిరెడ్డి రామునాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కామ్రేడ్ మేకా సూరిబాబు సాగు హక్కు కల్పించేలా ఎన్నో భూ పోరాటాలు చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ అమరవీరుల ఆశయాలు కొనసాగించడానికి నిరంతరం పోరాటాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అల్లూరి సిపిఐ జిల్లా కార్యదర్శిలు బాలేపల్లి వెంకటరమణ, పొట్టిక సత్యనారాయణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆర్‌వి.జగ్గారావు, అనకాపల్లి జిల్లా సహ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, కె.సన్యాసిరావు, ఏఐవైఎఫ్ రాష్ట్రసమితి సభ్యులు జి.రాధాకృష్ణ, అల్లూరి జిల్లా సిపిఐకార్యవర్గ సభ్యులు ఇరువాడ దేముడు, ఉల్లి సత్యనారాయణ, పిట్ల పోతురాజు, మాజీ శాసనసభ్యులు గొడ్డేటి దేముడు సతీమణి చెల్లయమ్మ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి